క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో సాంస్కృతిక శోభ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల్లో గురువారం పలువురు కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన కూచిపూడి నృత్య కళాకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. రాజమండ్రికి చెందిన కోలాట బృందాలు పలు కీర్తనలకు కోలాటాన్ని ప్రదర్శించి భక్తులను ఆకట్టుకున్నారు. చల్లపల్లికి చెందిన భజన బృందం అమ్మవారి కీర్తనలను ఆలపిస్తూ కోలాటాన్ని ప్రదర్శించింది. అమ్మవారి భజనలను, సంకీర్తలను ఆలపించగా, భక్తులకు విశేషంగా అలంకరించింది. కళాప్రదర్శన అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 25 మందికి జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన 25 మందికి కోర్టు జరిమానా విధించింది. నగరంలోని 2, 4వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 25 మందిని గుర్తించారు. వారిని ఆరో అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశ పెట్టగా, న్యాయమూర్తి లెనిన్ బాబు వారిలో నలుగురికి రూ.15 వేలు చొప్పున, మిగిలిన 21 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రమాదాల నివారణలో భాగంగా నగరంలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని, వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

పద్యనాటక వైభవాన్ని చాటిన గురుచరిత్ర



విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీదేవి కళాకారుల నాట్యమండలి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం ప్రదర్శించిన గురుచరిత్ర పద్యనాటక వైభవాన్ని చాటింది. షిర్డీ సాయి బాబా కథను పద్యనాటకంగా ఉప్పులూరి లక్ష్మీనారాయణ మలచగా నిమ్మగడ్డ ఏసుపాదం దర్శకత్వంలో చింతలపూడి నాగేశ్వరరావు పర్యవేక్షణలో నాటకాన్ని ప్రదర్శించారు. ఏపీ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వెలవెల సత్యనారాయణ గురువు ప్రాధాన్యతను వివరించారు. నాటక రంగానికి చెందిన పీవీఎస్ కృష్ణ, నిభానుపూడి సుబ్బరాజు, పి. వీరాంజినేయులు, కె. జగన్మోహనరావు, డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, ఉప్పాల రాజేశ్వరరావు, గణేష్ కుమార్, నాటక రచయిత లక్ష్మీనారాయణను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

ట్రాక్టర్, ట్రక్ చోరీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రోడ్డు పక్కన పార్క్ చేసిన ట్రాక్టర్‌ను దొంగిలించిన ఘటన భవానీపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కుమ్మరిపాలేనికి చెందిన ఎం.ప్రవీణ్‌కుమార్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తాడు. అతనికి సొంత ట్రాక్టర్ ఉంది. ప్రతి రోజు పనులు ముగిసిన తర్వాత భవానీపురంలోని నయారా పెట్రోల్‌బంక్ పక్కన పార్క్ చేస్తాడు. రోజు మాదిరే 8వ తేదీ రాత్రి బంక్ వద్ద రోడ్డు పక్కన ట్రాక్టర్, ట్రక్కును పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా ట్రాక్టర్, ట్రక్ కనిపించలేదు. దీనిపై బాధితుడు భవానీపురం స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

సంస్థను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇన్సూరెన్స్ క్లెయిమ్ మంజూరు చేయిస్తానని క్లయింట్ వద్ద డబ్బులు తీసుకొని ఉడాయించిన వ్యక్తిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీపురం హెచ్‌బీ కాలనీకి చెందిన కోయ చైతన్య కిరణ్ గ్లోరియస్ ఇన్సూరెన్స్ సొల్యూషన్ సర్వీసెస్ అనే సంస్థను నడుపుతున్నాడు. అతని వద్ద ఇన్సూరెన్సు కంపెనీల క్లెయిమ్స్ వెరిఫై చేసేందుకు తమ్మిశెట్టి విష్ణువర్ధన్ అనే ఎగ్జిక్యూటివ్‌ను నియమించాడు. వైఎస్సార్ కడప జిల్లాలోని పుల్లగూర నాగమునెమ్మ కోటక్ లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీ క్లెయిమ్ వెరిఫికేషన్ నిమిత్తం అతడిని పంపాడు. క్లెయిమ్ మంజూరు చేయిస్తానని ఆమె బంధువుల నుంచి రూ.1.11 లక్షలు వసూలు చేశాడు. ఇందుకు కంపెనీ పేరును వినియోగించుకొన్నాడు. అసత్య సమాచారంతో నకిలీ వెరిఫికేషన్ పత్రాలు సమర్పించి తనను మోసం చేశాడంటూ కోయ చైతన్య కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అధ్వాన రహదారితో తప్పని ఇక్కట్లు

- వర్షం పడితే బురద.. ఎండకు దుమ్ము
- ఊర్మిళానగర్ ప్రధాన రహదారి చివర రోడ్డు దుస్థితి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వర్షం పడితే బురద, ఎండకు దుమ్ము ఇది కబేళా నుంచి గొల్లపూడి వెళ్లే రోడ్డులో ఊర్మిళానగర్ వద్ద పరిస్థితి. ఈ రోడ్డు ఇన్నర్ రింగ్ రోడ్డులో భాగంగా ఉంది. ఊర్మిళానగర్ ప్రధాన రహదారి చివరన ఈ రోడ్డును క్రాస్ చేస్తూ డ్రెయిన్ సుబ్బారావు కాలనీ గుండా బుడమేరులో కలుస్తోంది. రోడ్డు క్రాస్ చేసే చోట పైపులైన్ నిర్మాణం జరిగింది. అది గతంలో ఎప్పుడో అప్పటి అవసరాలకు తగ్గట్టుగా ఏర్పాటు చేశారు. 2016 తర్వాత భవానీపురం, ఊర్మిళా నగర్, ఏకలవ్య నగర్ ప్రాంతాల్లో జనాభా పెరిగింది. కొత్త భవనాలు నిర్మాణం జరిగాయి. దీంతో డ్రెయినేజీ పెరిగింది. గతేడాది వచ్చిన వరదల కారణంగా ఈ డ్రెయిన్ వెనక్కు తన్ని వరద నీరు చర్చి సెంటర్ వరకు చేరింది. ఇప్పటి అవసరాలకు తగ్గట్టు, ఎగువ నుంచి వచ్చే వర్షపు నీటిని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ లోతు పెంచి కొత్తగా పైపుల ఏర్పాటు చేశారు. ఈ పనుల నిమిత్తం.. ఈ ఏడాది మార్చిలో రోడ్డు తవ్వారు. పలు కారణాలతో పనులు నెలల తరబడి సాగాయి. నేల మెతకగా ఉండడంతో కొంత మేర పనిచేసిన తర్వాత అది కూలిపోయింది. ఆ తర్వాత పనులు పూర్తి చేశారు. ఆ పనులు చేసిన భాగంలో తారు రోడ్డు తవ్వారు. ప్రస్తుతం తవ్విన చోట మట్టితో నింపి పూడ్చారు. దీంతో వర్షం పడితే అక్కడ బురదకయ్యాగా మారుతోంది. రహదారిపై వాహనాలు జారిపోతున్నాయి. గత మార్చి నెల నుంచి ఆ రోడ్డులో నివాసాలు ఉండే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

మరమ్మతులు చేయాలని వినతి..

వాహనాలు వెళ్తుంటే ఇళ్లలోకి దుమ్ము చేరి ఫర్నిచర్, వస్తువులు దుమ్ము కొట్టుకుపోతున్నాయి. ప్రధాన రహదారి పక్కన ఉన్న నివాసాల వారు రోజుకు రెండు, మూడు సార్లు ఇళ్లు శుభ్రం చేసుకోవాల్సిన



చిన్నపాటి వర్షానికే బురదమయంగా రోడ్డు



రోడ్డు తవ్విన చోట వాహనాల తాకిడికి దెబ్బతిన్న రోడ్డు

పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఇళ్లలోంచి బయటకు రావాలంటే వర్షాకాలం బురద, ఎండకాలం దుమ్ముతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పనులు ప్రారంభించినపుడు విపరీతంగా దుమ్ము లేచి అవస్థలు పడ్డారు. తవ్విన చోట గుంత పూడ్చి పైకి మట్టి పోశారు. వర్షాలకు ఆ మట్టి నాని బురద రోడ్డు మొత్తం విస్తరించింది. ఇక రోడ్డుపై చిన్న చిన్న గుంతల్లో బురద చేరి అలానే ఉండిపోయింది. వాహనాలు వెళితే పక్కగా వెళ్లే వారిపైనా, ఇళ్ల ప్రహరీలపైనా పడుతోంది. ఈ రోడ్డులో పెట్రోల్ బంక్ ఓ వైపు, దానికి ఎదురుగా పెద్ద అపార్టుమెంట్ ఉంది. బంక్‌కు వచ్చే వాహనదారులతో పాటు అపార్ట్‌మెంట్ వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. తాజాగా అక్కడకు సమీపంలోనే మరలా రోడ్డును తవ్వారు. వాహనాలకు డైవర్షన్ పెట్టారు. గొల్లపూడి వైపు నుంచి చనుమోలు వెంకట్రావు ఫ్లై ఓవర్ వైపు వచ్చి వెళ్లే వాహనాలు కబేళా నుంచి ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తాయి. డైవర్షన్ బారికేడ్లు ఇంతకు ముందు పనులు చేసిన రోడ్డు మలుపులు పెట్టడంతో వాహనాలు అక్కడ వరకు వచ్చి ఊర్మిళానగర్ రోడ్డుకు తిరిగి మరలా కరెంట్ ఆఫీసు రోడ్డులో కలుస్తున్నాయి. దీంతో గతంలో మరమ్మతులు చేసిన ప్రాంతంలో భారీ వాహనాల కారణంగా రోడ్డు కుంగిపోతుంది. మట్టి లేచి ఊర్మిళానగర్ రోడ్డులోని ఆవాసాలపై దుమ్ము ఎగిసిపడుతోంది. పెద్ద వాహనాలను గొల్లపూడి రోడ్డులోంచి అట్కిన్సన్ రోడ్డు వైపు అనుమతించకుండా పనులు అయిపోయే వరకు నేరుగా సితారా సెంటర్‌కు మీదుగా ఫ్లై ఓవర్ వైపు మళ్లించాలని స్థానికులు కోరుతున్నారు. డ్రెయినేజీ మరమ్మతు పనులు వేగంగా పూర్తి చేయాలని, ఆ డ్డు తవ్విన చోట వెంటనే తారు లేదా సిమెంట్ రోడ్డు వేయాలని కోరుతున్నారు.

సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో దుర్వాసన రాకుండా చర్యలు

పటమట(విజయవాడతూర్పు): సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన రామలింగేశ్వరనగర్ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను గురువారం పరిశీలించారు. సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో దుర్వాసన రాకుండా ఏర్పాటు చేయనున్న ఓడర్ కంట్రోల్ యూనిట్‌లను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వస్తున్న దుర్వాసన శాతం, ఓడర్ కంట్రోల్ యూనిట్ ఏర్పాటు చేసిన తర్వాత దుర్వాసన ఎంత శాతం తగ్గుతుందనే విషయంపై ఆరా తీశారు. దీనిపై తనకు సమగ్ర నివేదిక ఇవ్వాలని, వాటిని ఏర్పాటు చేసిన తర్వాత తానే స్వయంగా వచ్చి పరీక్షిస్తానని తెలిపారు. నగర పరిధిలోని అన్ని ప్లాంట్లలో ఓడర్ కంట్రోల్ యూనిట్లు ఏర్పాటు చేసి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలేజీ విద్యార్థులకు తమ చదువుల్లో భాగంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను చూపించే క్రమంలో కేవలం హెడ్ వాటర్ వర్క్స్ అనే కాకుండా సీబీహెచ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను చూపిస్తూ వాటిలో జరిగే ఇంజినీరింగ్ విషయాలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ప్రతి యూనిట్ దగ్గర సైనేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. యూనిడో ప్రాజెక్ట్ ద్వారా ఎస్‌టీపీలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి తమకు నివేదికను సమర్పించాలన్నారు. కమిషనర్ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జున్‌రావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్ కె.షమ్మీ, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి.వెంకటనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

నేత్రపర్వంగా వెంకన్నకు గరుడ సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గురుపౌర్ణమిని పురస్కరించుకొని వెంకన్న స్వామికి గరుడ సేవ ఉత్సవాన్ని గురువారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆషాఢమాస పౌర్ణమిని పురస్కరించుకొని గరుడ సేవ జరిగింది. గరుడవాహనంపై వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. అలాగే సహస్రనామార్చనలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి గరుడ ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. అదేవిధంగా స్వామి వారిని ఆలయ ప్రాంగణంలో మూడు సార్లు ఊరేగించారు.



గరుడ వాహనంపై కొలువుదీరిన వెంకన్న

శాస్త్రోక్తంగా తిరుమంజనం

ఆలయంలోని స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా గురువారం తిరుమంజనం అభిషేకాలను నిర్వహించారు. గురు పౌర్ణమిని పురస్కరించుకొని సుగంధ ద్రవ్యాలు, ఫలపుష్పాది రసాలతో స్వామి వారిని అభిషేకించి ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షిత్ నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.

ముగిసిన శాకంబరీదేవి ఉత్సవాలు



శాకంబరీదేవిగా భ్రమరాంబ అమ్మవారు



శాకంబరీదేవిగా విజయదుర్గ అమ్మవారు

వన్‌టౌన్(విజయవాడ): పాతబస్తీలోని వివిధ ఆలయాల్లో శాకంబరీ ఉత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయాలను, అమ్మవార్లను కూరగాయాలతో, ఆకుకూరాలతో అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆయా ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. అలాగే పలు ఆలయాల్లో గురువారం పూర్ణాహుతి కార్యక్రమాలతో ఉత్సవానికి ముగింపు పలికారు. పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాన్ని ముగింపును పురస్కరించుకొని చండీహోమాన్ని నిర్వహించి పూర్ణాహుతిని నిర్వహించారు. పౌర్ణమి కావటంతో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు. వన్‌టౌన్ కేటీరోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో, కొత్తపేట శ్రీనివాసమహల్ సెంటర్ సమీపంలోని శ్రీ గంగానమ్మ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాకంబరీ ఉత్సవాలను ముగింపు పలికారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బ్రాహ్మణవీధిలోని శ్రీ చదును మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శాకంబరీదేవి ఉత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలోని అష్టలక్ష్ములకు కూడా ప్రత్యేక అలంకారం గావించి పూజలు చేశారు.



గంగానమ్మ ఆలయంలో..

శ్రీమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో శాకంబరీదేవి ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల్లో మూడో రోజైన గురువారం అమ్మవారికి వివిధ రకాల పండ్లు, ఫలాలు, కాయగూరలతో అలంకరించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని షిర్డి సాయినాథుని మందిరంలో బాబాకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ప్రధాన కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బెజవాడ బిజినెస్ ఎక్స్‌పో ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని సత్యనారాయణపురం నాడార్స్ ఫంక్షన్ హాల్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించే బెజవాడ బిజినెస్ ఎక్స్‌పో- 2.0 గురువారం ప్రారంభమైంది. ప్రముఖ వైద్యుడు డాక్టర్ గంటి ఈశ్వర్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు, పారిశ్రామిక వేత్తలు తాము తయారు చేసిన ఉత్పత్తులను వినియోగదారులకు చేరువ చేసేందుకు ఇటువంటి ఎక్స్‌పోలను వేదికగా చేసుకోవాలని సూచించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ కుందా శ్రీధర్, కొప్పవరపు బలరామకృష్ణమూర్తి, పారిశ్రామికవేత్త శ్రీనివాస్, డాక్టర్ గురునాథ శర్మ, మల్లిక్, వ్యాపారవేత్త రాజకుమార్, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. సాయి బాబా, దేవతా మూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలు, అన్నదానాలను నిర్వహించారు. చిట్టినగర్‌లోని శ్రీ దత్తాత్రేయ సాయిబాబా మందిరంలో వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నాయకులు పిళ్లా సూరిబాబు(జగ్గు), అయితా కృష్ణ కిశోర్ తదితరులు పాల్గొన్నారు. బంగారయ్య కొట్టు సెంటర్‌లోని శ్రీశివ నాగ మందిరంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో వెలంపల్లిపాల్గొన్నారు. శ్రీవీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో వేంచేసిన శ్రీకృష్ణ సాయిబాబా మందిరింలో అర్చకుడు విన్నకోట శ్రీనివాసరావు శర్మ విశేష అభిషేకాలను నిర్వహించారు. 2 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఉత్సవాల్లో ఆలయ ఈవో వై. సీతారామయ్య, ఆలయ ఫౌండర్ ప్రెసిడెంట్ నందిపాటి నాగ వెంకట శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించగా, ఉభయదాతలు జగుపిళ్ల కనకారావు, చింతాడ రామచంద్రరావు, తిరుపతయ్య, చీమకుర్తి జయరామ్ పలువురు భక్తులు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. శాకంబరీదేవిగా అలంకరించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షాపీఠంలో గురు పూజా మహోత్సవాలను నిర్వహించారు. సర్దార్ రాంపిళ్ల సూర్యనారాయణ మహారాజ్ 107వ జయంతి, గురు పూజా మహోత్సవాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీకి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆలయాల్లో విశేష పూజలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సాయిబాబాను పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం సాయినాథుడికి పుష్పాలతో జరిగిన సహస్రనామార్చన కార్యక్రమంలో ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం బాబాకు భక్తులందరితో అన్నాభిషేకం చేయించారు. అనంతరం స్వామివారి అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం భవానీపురం వీధుల్లో సాయిబాబా ఊరేగింపు జరిగింది. కార్యక్రమాలను మందిరం పాలకమండలి అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు ఊటుకూరి శివనారాయణ, ఉపాధ్యక్షులు మోటుమర్రి సుబ్బారావు, ఇన్నమూరి వెంకట రమేష్, సభ్యులు పర్యవేక్షించారు. చెరువు సెంటర్‌లోని చిన్న సాయిబాబా గుడిలో శ్రీషిర్డీ సాయిబాబా సేవా సంఘం ఆధ్వర్యంలో బావిశెట్టి సూర్యకుమారి నేతృత్వంలో నిర్వహించిన గురు పౌర్ణిమ పూజల్లో వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. కుండల మార్కెట్ వద్దగల శ్రీగంగా దుర్గా మారెమ్మ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో దేవీ ఉపాసకురాలు తమ్మిన నవీన నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లోని శ్రీదాసాంజనేయ సహిత షిర్డీ సాయిబాబా, ఉమా రామలింగేశ్వర స్వామివార్ల మందిరంలో ప్రధాన అర్చకులు గురుజాడ బాల చంద్రశేఖర శర్మ, కృష్ణ నేతృత్వంలో చేసిన పూజల్లో వెలంపల్లి పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాదాన్ని వడ్డించారు. భవానీపురం టీచర్స్‌కాలనీలోని శ్రీదత్త-సాయి-భరద్వాజ సత్సంగ మందిరంలో విశేష పూజలు, అన్నప్రసాద వితరణ జరిగాయి.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట గణపతి రావురోడ్డులోని శ్రీ పండరి సాయి మందిరంలో స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక అర్చనలను నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారిని అత్యంత సుందరంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త నాగోతి వెంకటరామకృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించారు. పాండురంగస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు జరిగాయి. నెహ్రూ బొమ్మ సెంటర్‌లోని సాయి మందిరంలో భక్తులు పోటెత్తారు. బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక దీపాలంకరణ చేశారు. సాయి ప్రతిమకు అన్నాభిషేకాన్ని నిర్వహించారు. పాత శివాలయం ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ దత్తాత్రేయ స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అన్ని ఆలయాల్లో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.



చిట్టినగర్‌లో సాయిబాబాను దర్శించుకుంటున్న వెలంపల్లి



నెహ్రూబొమ్మ సెంటర్‌లో సాయిబాబా



వాగు సెంటర్‌లో బాబాకు అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు



హెచ్‌బీకాలనీ సంకల్ప సిద్ధి షిర్డీ సాయిబాబా మందిరంలో..



భవానీపురం కరకట్ట రోడ్డులో బాబా సేవలో వెలంపల్లి, కార్పొరేటర్లు

కృష్ణవేణి హోల్‌సేల్ మార్కెట్‌లో..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ సాయి ప్రేమ మండలి వారి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ ప్రాంగణంలో వేడుకలను నిర్వహించారు. విశేష పూజలు జరిపారు. మార్కెట్ అధ్యక్షుడు బచ్చు లక్ష్మీవెంకట ప్రసాద్, శ్రీ సాయి ప్రేమ మండలి ప్రముఖులు పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



తల్లిదండ్రులకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ పూర్ణచంద్రరావు



జహరాబీని అభినందిస్తున్న ఆంజనేయరెడ్డి, ఖాదర్, హెచ్‌ఎంలు

వించిపేట(విజయవాడపశ్చిమ): పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఫ్రైజర్‌పేటలోని మోటూరి హనుమంతరావు నగరపాలకసంస్థ పాఠశాల, కంసాలీపేటలోని తమ్మిన పోతరాజు మున్సిపల్ స్కూల్‌లో జరిగిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాలలో తల్లిదండ్రులకు పలు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్ హెచ్‌ఎం అబ్దుల్లాఖాన్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సాయిదుర్గ, ఉపాధ్యాయులు వి.పద్మజ, పిఎస్ఎల్ ప్రియాంక, వెల్ఫేర్ సెక్రటరీ సునీత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆత్మీయ సమావేశాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ సందర్భంగా గురువారం పలు పాఠశాలల్లో ఆత్మీయ సమావేశాలు జరిగాయి. టేనర్‌పేట పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ఫొటో బూత్‌లో తల్లిదండ్రులతో కలిసి సెల్ఫీ ఫొటో దిగారు. అలాగే పీఎల్ఎస్ఎంసీ పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ గోదావరి గంగ పాల్గొన్నారు. మసీదు రోడ్‌లోని ఎంఎంఎ ఖుద్దూస్ ఉర్దూ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరావును సత్కరించారు. పాఠశాల విద్యార్థిని షేక్ జహరాబీకి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిన సందర్భంగా అభినందించి బహుమతి అందజేశారు. జక్కంపూడి వైఎస్సార్‌కాలనీలోని మోడల్ ప్రైమరీ స్కూల్‌లో హెచ్‌ఎం ఎస్‌కె యూసుఫ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ప్రజాప్రగతి ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ జోషి సుధాకర్ డేవిడ్, ట్రస్ట్ ప్రతినిధులు అనూష, భవానీలు పాల్గొని విద్యార్థులకు భోజనం ప్లేట్లు బహూకరించారు. విద్యార్థులకు మొక్కలు అందజేశారు.

తల్లిదండ్రులకు ఆటల పోటీలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేవీఎల్‌రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలను నిర్వహించి, బహుమతులను అందజేశారు. స్కూల్ డైరెక్టర్ ఎనీవ్.రావు పర్యవేక్షణలో నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాయకులు నిరంతరం సాధన చేయాలి



విజయవాడ కల్చరల్: గాయకులు నిరంతరం సాధన చేయాలని కళా పోషకుడు మీరాకుమార్ అన్నారు. రాగలహరి కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో గురువారం ఆపాత మధురాలు సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. మీరాకుమార్ మాట్లాడుతూ గానం రాగభావ యుక్తంగా ఉండాలన్నారు. సాంస్కృతిక సంస్థలు గాయకులను ప్రోత్సహించాలని సూచించారు. సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు, ప్రసూనా రామన్, చింతకాయల చిట్టిబాబు, న్యాయవాది ముష్టి శ్రీనివాస్ ప్రసంగించారు. సీనియర్ గాయని మల్లాది స్వాతి ఆధ్వర్యంలో వడ్డాది కామేశ్వరి, సత్యస్వాతి, జయప్రభ, అయ్యప్పన్, రామాంజి నాయక్, సత్య తదితరులు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు అతిథులను సత్కరించారు.